క్లుప్తంగా

భవన నిర్మాణానికి స్థలం కేటాయింపుపై హర్షం



సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న రవికుమార్

ఏయూ క్యాంపస్: యాదవ భవన నిర్మాణానికి అరెకరం భూమి కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మేయర్ గొలగాని హరి వెంకట్‌కుమారికి యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గుంటుబోయిన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ అతిథి గృహంలో వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.విసుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ జిల్లా యాదవ సామాజిక వర్గం రుణపడి ఉంటుందన్నారు. యాదవ భవన్ ఏర్పాటుకు సహకారం అందించిన మంత్రి కారుమూరి నాగేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ సభ్యులు పల్ల మహేష్, పిన్నింటి అప్పలరాజు, కోన బాబు, ఈశ్రపు శ్రీరామ్, ఒమ్మి రామారావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'నెరవేరిన ఎల్‌ఐసీ ఏజెంట్ల కల'



కార్యక్రమంలో మాట్లాడుతున్న గజపతిరావు

ఎంవీపీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో ఎల్‌ఐసీ ఏజెంట్ల కల నెరవేరిందని ఎల్‌ఐసీ లియఫి ఇండియా జనరల్ సెక్రటరీ గజపతిరావు అన్నారు. గురువారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్‌ఐసీ ఏజెంట్ల గ్రాట్యుటీ పరిమితి పెంపు, పునరుద్ధరణ కమిషన్‌కు అర్హత, టర్మ్ ఇన్సూరెన్స్ రక్షణ, కుటుంబ పెన్షన్ వంటి అంశాల్లో కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకుందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఎల్‌ఐసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల నివారణకు నిల్వ నీటిలో మందు జల్లుతున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం : జీవీఎంసీ మలేరియా విభాగం అధికారులు దోమల నివారణకు చర్యల చేపట్టారు. కాలువలు, నీటి నిల్వ ఉండే ప్రదేశాలలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు.

25న ఎస్పీ బాలు తృతీయ వర్ధంతి

మద్దిలపాలెం : గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి ఈ నెల 25న నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం తనికెళ్ల భరణి దర్శకత్వంలో ఎస్పీ బాలు నటించిన మిథునం చిత్రాన్ని ప్రదర్శించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

క్రీడా పోటీల సందడి

- తోటగరువు హైస్కూల్‌లో నిర్వహణ
- 15 పాఠశాలల నుంచి 120 మంది హాజరు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం పరిధి ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం తలపెట్టిన క్రీడా పోటీలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14, 17 సంవత్సరాల్లోపు విద్యార్థులకు ఈ పోటీలు ఈ నెల 23 వరకు కొనసాగనున్నాయి. తొలి రోజు ప్రత్యేకంగా బాలురకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నియోజకవర్గంలో 15 పాఠశాలల నుంచి 120 మంది హాజరయ్యారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. కబడ్డీ అండర్ 14 విభాగంలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు, కేడీపీఎం ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఖోఖో అండర్–14 విభాగంలో ఆరిలోవ సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన నలుగురు, శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారన్నారు. అథ్లెటిక్స్‌లో తోటగరువు, సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. శుక్రవారం బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోటీలను పాఠశాల హెచ్‌ఎం దుర్గాభవాని పర్యవేక్షించారు.



యోగా పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవం



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు తదితరులు

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ 42 ఏళ్లుగా ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొల్పాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించాలన్నారు. వివిధ దేశాల మధ్య శాంతికి విఘాతం కలిగితే అది మానవ మనుగడకే ముప్పుగా మారుతుందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బాల్యం నుంచే యువత శాంతి, సామరస్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, నరవ ప్రకాశరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి



పాత డెయిరీ ఫారం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విశాఖ ఉక్కును ప్రజలే కాపాడుకోవాలంటూ సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి పక్కన పాత డెయిరీ ఫారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ బైక్ ర్యాలీకి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు నరేంద్రకుమార్, శంకరరావు, సత్యనారాయణ, లక్ష్మి, భూలోకరావు, సన్యాసమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో అన్నసమారాధన



ఎంవీపీ రైతుబజార్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఈవో, రైతులు



భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న వెంకటరావు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ రైతుబజార్‌లో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. రైతులు, డ్వాక్రా మహిళలు, వ్యాపారులు కలసి వినాయక ఉత్సవాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా సుమారు 1000కి పైగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సహాయకుడు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: చినవాల్తేరు తమిళ్ స్ట్రీట్ బాయ్స్ ఆధ్వర్యం లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేయింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: దేశాల మధ్య శాంతి నెలకొల్పడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి కోసం దేశాలన్నీ కలిసి కృషి చేయాలని, భారతదేశం చురుకైన పాత్ర వహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు నిత్యం జరుగుతూనే ఉండాలని సూచించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ శాంతిని నెలకొల్పడం కోసం ఐక్య రాజ్య సమితి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో బేగ్, ప్రజ్ఞాన్ కుమార్, నాయుడు, కమల్, గోపీచంద్ పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ ఈవోకు సత్కారం



ఈఓ గాయిత్రిని సత్కరిస్తున్న గ్రామపెద్దలు

ఏయూ క్యాంపస్: పోలమాంబ ఆలయ ఈవో కె.గాయత్రిని పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం పెద్దలు గురువారం మర్యాద పూర్వకంగా ఆలయంలో కలిశారు. అనంతరం గాయత్రిని సత్కరించారు. అనంరతం త్వరలో జరగనున్న కనకమ్మ పండగ నిర్వహణపై చర్చించారు. గ్రామ ఆచారాలకు అనుగుణంగా పండుగ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బోర దాసురెడ్డి, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ చిల్లా రామారావు, సెక్రటరీ దల్లి అప్పలరెడ్డి, కోశాధికారి పలికల పైడితల్లి రెడ్డి, పోలమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి, సభ్యులు పలికల నీల రెడ్డి, మరడ హరనాథ్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు



19వ వార్డులో కొలువుదీరిన గణనాథుడు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెద జాలరిపేటలో వినాయక చవితి వేడుకలు కొనసాగుతున్నాయి. జాలరిపేట యూత్‌తో పాటు స్థానిక మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో పరుశురాముడి రూపంతో పాటు పార్వతీ సమేత గణనాథుడి ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు, మహిళలు సరస్వతి పూజతో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైలు కింద పడి వ్యక్తి మృతి



సంజయ్ (ఫైల్)

గోపాలపట్నం: కుటుంబ కలహాలతో రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పద్మనాభనగర్ ఎస్సీబీసీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ బీసీ కాలనీ వద్ద నివాసముంటున్న పొలమరశెట్టి సంజయ్(38) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లు రేషన్ పంపిణీ చేసే వాహనాన్ని నడిపేవాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెదకగా రైల్వే ట్రాక్‌పై మృతి చెందడం గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు



నిమజ్జన ఊరేగింపులో సందడి చేస్తున్న యువతీ, యువకులు

మద్దిలపాలెం: వినాయక నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. పిఠాపురం కాలనీ కళాభారతి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ముందుగా భారీగా బాణసంచా కాల్చారు. అనంతరం వీధిలోని యువతీ, యువకులు, చిన్న పెద్ద తేడాలేకుండా అందరూ ఊరేగింపు ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే మ్యూజిక్‌కు తగ్గట్టుగా స్టెప్‌లు వేసి సందడి చేశారు. దీంతో పిఠాపురంకాలనీ సాయంత్రం నుంచి రాత్రి వరకూ డీజేతో హోరెత్తిపోయింది. ఈ ఊరేగింపును తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పాత ఆరిలోవలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో పలు అభివృద్ధి పనులకు గురువారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. పాత ఆరిలోవలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం కోసం ఆమె భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ రూ.22 లక్షలు జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వార్డులో కొన్నాళ్లుగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పాత ఆరిలోవ ప్రాంతం దుర్గాలమ్మ గుడి వద్ద జీవీఎంసీ కల్యాణ మండపాన్ని ఆధునిక హంగులతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం స్థానిక మహిళలతో మేయర్ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, స్థానిక పెద్దలు ఒమ్మి పోలరావు, కొల్లి అప్పారావు, కొల్లి అప్పలనాయుడు, వెంకటరమ, గొలగాని రాంబాబు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

వినాయక చవితి ప్రాముఖ్యతపై పోస్టర్ల ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వినాయక చవితి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ నగరానికి చెందిన వాస్తు, జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ తీర్చిదిద్దిన పోస్టర్లను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్కోజు శివరామ మాట్లాడుతూ 1894లో తొలిసారిగా పూనేలో సర్వజనిక్ గణేష్ ఉత్సవ్ పేరుతో మట్టి వినాయకులను ప్రతిష్టించి కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించారని గుర్తు చేశారు. అప్పటి వరకు దేశంలో కనిపించిన అంటరానితనం ఈ నవరాత్రి మండపాల వల్ల కొంత దూరమైందన్నారు. బాల గంగాధర్ తిలక్ సారథ్యం వహించి దీనిని ముందుకు నడిపించిన విధానాన్ని ఆయన వివరించారు. నగరంలో పలు ప్రధాన కూడళ్లలో బాలగంగాధర్ తిలక్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

డీఎల్‌సీసీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉష



ఉషను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి.ఉష డిస్ట్రిక్ట్ లెవెల్ లోకల్ కంప్లెయింట్స్ కమిటీ(డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్‌గా రెండో సారి నియమితులయ్యారు.

ఈమె ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈమెతో పాటు ఇతర సభ్యులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు సంబంధిత ఫిర్యాదులపై ఈ కమిటీ విచారణ చేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్త గురజాడ



గురజాడ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు



గురజాడ గురించి మాట్లాడుతున్న బీవీకే విశ్రాంత ఆచార్యులు డి.వి.సూర్యారావు

ఏయూ క్యాంపస్: ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా గురజాడ అప్పారావు పేరొందారని ఏవీఎన్ కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ ఎస్.పోలయ్య అన్నారు. గురువారం ఏయూ తెలుగు విభాగంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పోలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ సమాజాన్ని తన రచనల ద్వారా మేల్కొల్పారన్నారు. గురజాడ రచనలు భాషలో, భావంలో, చందస్సులో నూతనత్వాన్ని ప్రతిపాదించారన్నారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్య చరిత్రలో అజరామమై నిలిచిన విధానాన్ని వివరించారు. ఈ నాటకం అనేక విమర్శలకు దీటుగా నిలబడటానికి కారణాలను విశ్లేషించారు. దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అన్న పద్యపాదంలో గురజాడ దేశభక్తితో పాటు మంచి సమాజం కోసం పరితపించారని, అటువంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారన్నారు. సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులు ఆచార్య జి.యోహాన్‌బాబు, ఆచార్య వెలమల సిమ్మన్న, తెలుగు ఆచార్యులు డాక్టర్ ఎ.సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, అడపా రామకృష్ణ, ఇళ్ళ మురళీధరరావు, వి.రామారావు, పరిశోధక విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : గురజాడ అప్పారావు జయంతి వేడుకలను మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, ముఖ్యఅతిథి బీవీఏ విశ్రాంత ఆచార్యులు డి.వి. సూర్యారావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.అర్పించారు. అనంతరం ఆచార్యుడు డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవి, దార్శనికుడు నవయుగ వైతాళికుడు , జ్ఞాని, దేశభక్తుడు గురుజాడ అప్పారావు అని కొనియాడారు. గురజాడ రచనల గురంచి సుదీర్ఘ ఉపన్యాస్యం ఇచ్చారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి పలువురు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ అధ్యక్షుడు ఎంఆర్‌ఎన్ వర్మ, జిల్లా అధ్యక్షులు కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఆధునికీకరణపై హర్షం

- ఏయూను సందర్శించిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు



ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను పరిశీలిస్తున్న విజయబాబు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు సందర్శించారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రగతిని వీసీ ప్రసాదరెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం ఏయూలో ఆధునీకీకరించిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగి, ఎందరో జాతీయ స్థాయి కళాకారులకు సైతం స్థానం కల్పించిన ఈ ప్రాంగణం పునరుజ్జీవనం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏయూ ఉద్యోగులతో కలసి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.